పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెప్పుడో..

కథలాపూర్: గ్రామ పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాలు, అసంపూర్తి నిర్మాణాలతో అరకొర వసతులతో ఉండడంతో సరైన పాలన అందడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులు రూ.20లక్షలు గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల కోసం మంజూరు చేసినా.. ఏళ్లుగా పనులు పూర్తి కాకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. మండలంలో 19 గ్రామాలున్నాయి. చింతకుంట, భూషణరావుపేట, బొమ్మెన, రాజారాంతండా గ్రామాల్లో పంచాయతీలకు పక్కా భవనాల కోసం ఉపాధిహామీ పథకం నిధులు రూ.20లక్షల చొప్పున రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. చింతకుంటలో పంచాయతీ భవనం పనులు స్లాబ్ వరకు పరిమితమయ్యాయి. మిగతా గ్రామాల్లో స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తయినట్లు ఆయా గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ అధికారులు చొరవ చూపి అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం నిర్మాణాల పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


చింతకుంటలో అసంపూర్తిగా పంచాయతీ కార్యాలయ భవనం

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: తక్కళ్లపెల్లి గ్రామ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వినోద్ గురువారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేయగా ట్రాక్టర్లు కనిపించాయన్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

పేషెంట్ మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాల: రాయికల్ పట్టణానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23న సిగ్మా ఆస్పత్రిలో హృదయ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నిర్లక్ష్యమంటూ వారి బంధువులు ఫిర్యాదు చేయగా.. గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అందరి వివరాలు తీసుకొని విచారించి నివేదికను జిల్లా వైద్యాధికారికి పంపిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ


తిమ్మాపూర్‌లో ఇళ్ల పత్రాలు అందిస్తున్న నాయకులు

ధర్మపురి: తిమ్మాపూర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను గురువారం పంపిణీ చేశారు. నీటిపారుదల సంఘం చైర్మన్ వావిలాల ప్రకాశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు లింగాల హరీశ్, కుమ్మరి నవీన్, వెంగల్‌దాస్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నిర్ణీత గడువులో ఇళ్లు పూర్తి చేయాలి

రాయికల్: గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని డీపీవో మదన్‌మోహన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో చిరంజీవి, విజిలెన్స్ అధికారి దేవేందర్, ఎంపీవో సుష్మ, ఏపీవో దివ్య, హౌసింగ్ ఏఈ తిరుమల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సారంగాపూర్: నిర్ణీత గడువులో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో భీమేశ్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పనుల ఆలస్యంపై సమీక్షించారు. లబ్ధిదారులు పనులను వేగవంతం చేస్తే వెంటనే బిల్లులు అందిస్తామన్నారు. హౌసింగ్ ఏఈ వాసవి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, కారోబార్ మ్యాడ గంగారెడ్డి తదితరులున్నారు.

మైక్‌సెట్ అందజేత




కోరుట్లటౌన్: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మైక్‌సెట్ అందజేసినట్లు హెచ్‌ఎం వడ్లకొండ గంగాధర్ గురువారం తెలిపారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ చీఫ్ మంచాల జగన్ రూ.18వేల విలువైన మైక్‌సెట్ విరాళంగా అందించారు. కొమ్ముల జీవర్‌రెడ్డి, ఏలేటి లక్ష్మారెడ్డి, గుంటుక మహేశ్, బెజ్జెంకి శ్రీనివాస్‌రావు, కుడేల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు



రాయికల్: ధర్మాజీపేట గ్రామంలోని ఎస్సీకాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు నెల రోజులుగా పని చేయడం లేదు. కాలనీవాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గురువారం కాలనీకి చెందిన నేరెళ్ల అరవింద్, రాజేందర్, లక్ష్మణ్, నాగరాజు, సతీశ్, మహేశ్ స్వయంగా మరమ్మతు చేశారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



రాయికల్: కొత్తపేట గ్రామానికి చెందిన ముత్యాల రాము ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. గురువారం గ్రామంలోని యువజన సంఘం సభ్యులు రూ.24,100 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద కుటుంబం కావడంతో అందజేశామన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే అభివృద్ధి


విద్యార్థులకు టీషర్టులు అందిస్తున్న డీఈవో రాము

వెల్గటూర్: ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో సాన భీమవ్వ జ్ఞాపకార్థం సాన జయాకర్, మారుతి, ఆంజనేయులు సహకారంతో విద్యార్థులకు రూ.50వేల విలువైన రంగుల టీషర్టుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుల్లకోట హెచ్‌ఎం రాజిరెడ్డి కృషితో రూ.లక్షల విరాళాలు సేకరించి విద్యార్థులకు 3 రంగుల యూనిఫాం, మినరల్ వాటర్ లాంటి సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. దాతలను సన్మానించారు. మండల విద్యాధికారి హరికృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడిమ్యాల: తిరుమలాపూర్ పంచాయతీ సంద్రాలపల్లి కేజీబీవీ పాఠశాలలో మండల ఆరోగ్య శాఖ అధికారులు కిశోర బాలికలకు జంక్ ఫుడ్, పోషకాహార లోపం, రక్తహీనతపై వివరించి హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. పోషకాహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలిచినవారికి బహుమతి ప్రదానం చేశారు. మల్యాల ఏసీడీపీవో అరవింద, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు నరేశ్, పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికిరణ్

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవికిరణ్ అన్నారు. గురువారం జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు 18 ఏళ్లు దాటిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతీ వ్యక్తి హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సింధూజ

కథలాపూర్: వ్యక్తికి గుండె నొప్పి వస్తే అత్యవసరంగా సీపీఆర్ చేయాలని, సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి సింధూజ అన్నారు. గురువారం కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎం శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి


ధర్మపురిలో బీసీల సమావేశం

ధర్మపురి: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బందును విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఐకాస చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పిలుపు మేరకు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. నాయకులు స్తంభంకాడి శ్యామ్, వేముల సురేశ్, బోరె మల్లేశం తదితరులున్నారు.

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేసిందని, కేంద్ర ప్రభుత్వం సైతం 9వ షెడ్యూల్‌లో పొందుపర్చి బిల్లును ఆమోదించాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 18న అందరూ బందులో పాల్గొనాలని కోరారు.

మేడిపల్లి: కొండాపూర్ గ్రామంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 18న జరిగే బీసీ బంద్ విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు ఎదులాపురం దుబ్బరాజ్యం, కాంగ్రెస్ మండల నాయకులు మూసికేం జలంధర్‌గౌడ్, భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ములుగు హనుమంతు, గ్రామ కార్యదర్శి చెరుకూరి రాజేశం, సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు ఎద్దండి భూమయ్య, ప్రజానాట్య మండలి కళాకారులు బొల్లె రాజం. డప్పు భూమయ్య, పారకొండ గంగాధర్, ఎర్ర నాగభూమయ్య, జంగిలి జలంధర్, జెట్టి రాజం, పాతల్ల రాజం పాల్గొన్నారు.

ఆరోగ్య సలహాలు పాటించాలి


పెగడపల్లిలో చిన్నారికి అన్నప్రాసన

పెగడపల్లి: సమతుల ఆహారం తీసుకుంటూ ఆరోగ్య సలహాలు పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం జాతీయ పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు జరిపారు. హెల్త్ సూపర్‌వైజర్ ద్వారకా, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన టీజీవో కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. పీఆర్సీ రిపోర్టు తెప్పించుకొని వెంటనే ఫిట్‌మెంట్ 51 శాతానికి తగ్గకుండా ప్రకటించాలన్నారు. బాకీ పడిన 5 డీఏలతోపాటు 2 డీఏలను కలిపి వెంటనే ప్రకటించాలని, 3 పీఆర్సీలను కలపాలని కోరారు. సబ్ కమిటీ ప్రకటించినవిధంగా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, కార్యదర్శి మామిడి రమేశ్, జగిత్యాల జేఏసీ చైర్మన్ నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



జగిత్యాల: జిల్లాలో సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ నిజామొద్దీన్, కార్యదర్శిగా చైతన్య, కోశాధికారిగా అభిషేక్, ఉపాధ్యక్షులుగా స్వప్న, అబ్దుల్ ఖలీం, వేణుమాధవ్, సభ్యుడిగా వెంకటసాయిరెడ్డి ఎన్నికయ్యారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాజేందర్

రాయికల్: మాల జంగం కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మాల జంగం కులమహేశ్వరుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలుకా రాజేందర్ అన్నారు. గురువారం కిష్టంపేట గ్రామంలో కుల సంఘ నాయకులతో పర్యటించారు. సంఘ నాయకులు పడుతున్న బాధలనడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సారంగాపూర్: సారంగాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్, నాయికపుగూడెం, బట్టపల్లి, పోతారం గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్ స్టేషన్‌తోపాటు విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని


శిరీషను సన్మానిస్తున్న ఎంఈవో, స్పెషల్ ఆఫీసర్

రాయికల్: ఉప్పుమడుగు కేజీబీవీ పాఠశాలకు చెందిన మోస్రం శిరీష రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సుప్రియ తెలిపారు. గురువారం శిరీషను ఎంఈవో రాఘవులు, స్పెషల్ ఆఫీసర్ శోభారాణి సన్మానించారు.

డీజీపీని కలిసిన జువ్వాడి

కోరుట్ల: నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛమందించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన మాధురి(22) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. మాధురి, అదే గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి రవి ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహమైన కొద్దిరోజుల తర్వాత మాధురిని భర్త రవి, అత్త సత్తమ్మ, మామ రాజం, ఆడబిడ్డ రవళి వేధింపులకు గురిచేస్తున్నారు. బుధవారం రాత్రి మాధురి ఉరేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మాధురి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పర్యావరణం కోసం పాటుపడాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

జగిత్యాల: విద్యార్థులు పర్యావరణం కోసం పాటుపడాలని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. గురువారం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల సూచనల ప్రకారం నేషనల్ గ్రీన్ కార్పొరేషన్ తెలంగాణ వారి సహకారంతో కళాశాలలో ఈకో బజార్ ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణహిత వస్తువుల తయారీ, ప్రదర్శన, అమ్మకం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



సారంగాపూర్: రేచపల్లి–పోతారం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో 15 సంవత్సరాల క్రితం వేసిన తారు రోడ్డు పూర్తిగా చెడిపోయి నడవడం కష్టంగా మారింది. గుర్తించిన అధికారులు 2 సంవత్సరాల క్రితం రోడ్డును రెన్యూవల్ బీటీగా చేసేందుకు రూ.1.50కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. తారుకు ముందు చిన్న కంకర(చిప్స్ వరకు) పనులు పూర్తి చేసి తారు వేయకుండా వదిలిపెట్టడంతో.. 2 సంవత్సరాల్లో రోడ్డు మరింత అధ్వానంగా మారింది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పశువులకు ముందస్తు టీకాలివ్వాలి


పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ నరేశ్

కథలాపూర్: ప్రతీ గ్రామంలో పశువులకు ముందస్తుగా టీకాలివ్వాలని పశు సంవర్ధక శాఖ ఏడీ నరేశ్ అన్నారు. గురువారం చింతకుంట గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని పశువులకు టీకాలిచ్చారనే విషయాలనడిగి తెలుసుకున్నారు. పశు వైద్యాధికారి దివ్యశ్రీ, సిబ్బంది రాజుకుమార్, రసూల్, దశరథం ఉన్నారు.

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 132 గేదెలు, 42 ఆవులకు గాలికుంటు టీకాలు వేశారు. అధికారి డాక్టర్ వెన్నెల, నరేశ్, గోపాలమిత్ర పుల్లూరి దేవయ్య, మురళి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి హేమలత సూచించారు. ఏడుమోటలపల్లిలో గురువారం పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్గటూర్: పశువుల్లో రోగ నిరోధక శక్తి పెంచేందుకు, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టినట్లు మండల పశు వైద్యాధికారి డా.శ్రీప్రియ తెలిపారు. గురువారం వెంకటాపూర్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మాజీ సర్పంచ్ రాందేని కోటయ్య, నాగరాజు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

మెట్‌పల్లిరూరల్: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండె ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడొచ్చన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యాధికారులు అంజిత్‌రెడ్డి, శివాని, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని ప్రమోద్‌కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆరోగ్యశ్రీ సేవలపై అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణాలకు 443 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 443 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ గురువారం తెలిపారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరన్

పెగడపల్లి: వానాకాలం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీఆర్డీవో రఘువరన్ అన్నారు. మండలంలోని గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు గురువారం సెర్ప్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కేంద్రాల్లో రైతులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. తేమ శాతం 17 వచ్చినా ధాన్యం తూకం చేసి వెంటనే రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సేకరించిన ధాన్యం బస్తాలను కేటాయించిన మిల్లర్లకు మాత్రమే తరలించాలని, మిల్లర్లు ఇబ్బందులు పెడితే అధికారుల దృష్టికి తేవాలన్నారు. తూకంలో నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు. ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, మండల డీపీఎం నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు రూపకళ, ఏపీఎంలు రవివర్మ, త్రివేణి, దేవరాజం, పెగడపల్లి, గొల్లపల్లి, మల్యాల సీసీలు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్: పట్టణంలోని 8వ వార్డులో రోడ్డుపై గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో నడవడం కష్టంగా ఉందని, వెంటనే గుంతలను పూడ్చాలని కోరుతూ కాలనీకి చెందిన నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. పల్లికొండ గంగాధర్, దువ్వాసి మహేశ్, కల్లెడ గణేశ్, అంజయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పట్టణంలోని 11వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీకి చెందిన మహిళలు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో పైపులైన్ సరిగా లేకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాకల రమేశ్, రజిత, కళావతి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.54వేలు

కోరుట్లటౌన్: వెంకటాపూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీ లెక్కించగా.. రూ.54,739 సమకూరినట్లు ఆలయ ఈవో ఎం.విక్రమ్ గురువారం తెలిపారు. జగిత్యాల అధికారి ఎం.రాజమొగిలి, ఆలయ అధ్యక్షుడు కటుకం రాజేశం, పూజారి టి.వెంకటరమణ, రవీందర్‌రెడ్డి, బాజోజి రవీందర్, సహాయాధికారి పి.నర్సయ్య, రాజేందర్, కేశవ్, గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.